
మల్హర్ : తాడిచర్లలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


మహాముత్తారం : యామన్‌పల్లిలో పూజలు చేస్తున్న గులాబీ శ్రేణులు

# బీఆర్‌ఎస్‌తోనే పేదల అభ్యున్నతి

- గ్రామాల్లో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం
- మ్యానిఫెస్టో, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తున్న పార్టీ శ్రేణులు

మహాదేవపూర్, నవంబర్ 6 : బీఆర్ఎస్‌తోనే పేదల అభ్యున్నతి, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతుంది. సోమవారం ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గడపగడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నికల మ్యానిఫెస్టో, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ చొరవతోనే మారుమూల గ్రామాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. రానున్న ఎలక్షన్‌లో బీఆర్ఎస్‌ను ప్రజలు ఆశీర్వదించి పుట్ట మధూకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్‌రావు, సర్పంచ్‌లు శ్రీపతిబాపు, ఓడేటి పద్మ, ఎంపీటీసీలు పద్మా ఓదెలు, బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు ఓ స్వప్న, మండల ప్రధాన కార్యదర్శి జీ కిరణ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మల్హర్‌లో..

మల్హర్ : మండలంలో ఇంటింటా ప్రచారంలో భాగంగా తాడిచర్ల, రుద్రారం, కొండంపేట చిన్నతుండ్ల, కొయ్యూర్, ఎడ్లపల్లి, వల్లెకుంట, అన్‌సాన్‌పల్లి, నాచారం గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ప్రచారం చేశాయి. పార్టీ మ్యానిఫెస్టోను వివరిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అభివృద్ధి, సంక్షేమం పుట్ట మధూకర్‌తోనే సాధ్యమవుతాయన్నారు. రాబోయే రోజుల్లో పుట్ట మధూకర్ ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రభుత్వ పథకాలతో పాటు తన సొంతంగా మరిన్ని సేవలు అందిస్తారన్నారు. రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, సీఎంగా కేసీఆర్ పాలన అందిస్తారన్నారు. ఆయన నాయకత్వంలో ఎమ్మెల్యేగా పుట్ట మధూకర్‌ను గెలిపించుకుంటే ఎంతో మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీ లేని పథకాలతో ముందుకు వస్తున్నారని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో కుంభం రాఘవరెడ్డి, ఆర్బీఎస్ మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, మంథని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పుట్టపాక శ్రీనివాస్, సర్పంచ్‌లు అడ్డూరి కుమారస్వామి, పొందాల ధనలక్ష్మీ నారాయణ, విజయా నాగేశ్వర్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మహాదేవపూర్ : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### మహాముత్తారంలో..

మహాముత్తారం : మండలంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్నది. యామన్‌పల్లిలో పార్టీ మ్యానిఫెస్టోను ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులకు వివరించారు. అనంతరం గ్రామంలోని సమ్మక్క, సారలమ్మ ఆలయంలో బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ భారీ మెజార్టీతో గెలువాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ సోమ శాంతకుమార్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మందల రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు కల్వచర్ల రాజు, మండల మహిళా అధ్యక్షురాలు లింగమల్ల రమాదేవి, జగన్‌నాయక్, గ్రామ, యూత్ అధ్యక్షులు చంద్రయ్య, రాజబాపు, వార్డు సభ్యుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

### కాళేశ్వరంలో..

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఉపసర్పంచ్ అరుట్ల పవన్ ఆధ్వర్యంలో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం గడప గడపకూ వెళ్లి బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు లేతకరి అనంద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీవాలకు పీపీఆర్ టీకాలు

మహాదేవపూర్, నవంబర్ 6 : మండల పరిధిలోని పెద్దంపేట గ్రామంలో మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం సుమారు 900 (గొర్రెలు, మేకలు) జీవాలకు పీపీఆర్ టీకాలు వేశారు. జీవాలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ నాగభూషణం ఆచార్యులు, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయదేవ్

## శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

ములుగు రూరల్, నవంబర్ 6 : విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకొని శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ సూచించారు. సోమవారం బండారుపల్లి మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి జిల్లా స్థాయి సైన్స్ గ్రామ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జయదేవ్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టే సైన్స్ కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని శాస్త్రీయతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ సుదర్శన్‌రెడ్డి, రాజు, సాంబయ్య, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ రవిప్రసాద్, డీసీఈబీ సహాయ కార్యదర్శి విక్రమ్‌రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిన్నా

## సామాజిక సేవలో విద్యార్థులు ముందుండాలి

ఏటూరునాగారం, నవంబర్ 6 : సామాజిక సేవలో విద్యార్థులు ముందుండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నా అన్నారు. కళాశాలలో సోమవారం తొలిమెట్టు కమ్యూనిటీ కార్యక్రమంపై వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు చదవడం, రాయడంపై పరిజ్ఞానం కోసం వలంటీర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వీరు ప్రతి శనివారం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నైపుణ్యాలు, సృజనాత్మకను పెంపొందించాలని కోరారు. విద్యార్థులు చదువులో పురోగతి సాధించేలా చూడాలన్నారు. ఇది వలంటీర్లకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ వర్క్‌షాపులో 80 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఘన్‌సింగ్, రమేశ్ కుమార్, యూ స్వామి, బీ రేణుక, వెంకటయ్య, నవీన్, ఫాతిమా, జ్యోతి, సంపత్ కుమార్ పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ పోచం

## నాణ్యమైన ఆహారం అందించాలి

మహాదేవపూర్, నవంబర్ 6 : వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఐటీడీఏ ఏటూరునాగారం భూపాలపల్లి డీడీ పోచం సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీలు చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల, హాస్టల్ రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శారదా శివలక్ష్మి, హెచ్‌డబ్ల్యూవో బీ సరిత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మవరం వద్ద వాహనాల తనిఖీ

వాజేడు, నవంబర్ 6 : మండలంలోని ధర్మవరం గ్రామం వద్ద ఉన్న రహదారిపై సోమవారం పేరూరు ఎస్సై గోర్ల రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. బ్యాగులు సోదా చేసి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.


గ్రామస్తులకు వైద్యం చేస్తున్న డాక్టర్ సుచరిత

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం, నవంబర్ 6 : మండలంలోని రామన్నగూడెంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు సుచరిత మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం వచ్చిన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. గ్రామస్తులకు రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. వైద్య శిబిరంలో హెల్త్ అసిస్టెంట్ జైలు బాబు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై లక్ష్మణ్‌రావు

## అనుమానితుల సమాచారం ఇవ్వాలి

కాళేశ్వరం, నవంబర్ 6 : గ్రామంలోకి అనుమానిత వ్యక్తులు వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కాళేశ్వరం ఎస్సై లక్ష్మణ్‌రావు అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా పలుగుల జీపీ పరిధిలోని కుంట్లాం గ్రామంలో ప్రతి ఇల్లు తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ పోలీసులు ఉన్నారు.

## అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

చిట్యాల, నవంబర్ 6 : కనిపించకుండా పోయిన గుంటూర్‌పల్లి గ్రామానికి చెందిన కొంక శ్రీనివాసరావు(54) గ్రామ శివారులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 4న జామాయిల్ తోటకు నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకీ దొరకలేదు. శ్రీనివాస్‌రావు కుమారుడు 5న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం గ్రామశివారులో మృతదేహం పడి ఉండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. అడవి పందుల కోసం పొలాల చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్టు ఎస్సై జంగిలి రమేశ్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


శ్రీనివాసరావు (ఫైల్)

## రియల్ ఎస్టేట్ వ్యాపారుల రోడ్డు వెడల్పును ఆపాలి

ములుగు రూరల్, నవంబర్ 6 : ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల వెంచర్ల కోసం ఎస్సీ కాలనీ నుంచి తీస్తున్న దారుల నిర్మాణాలను ఆపాలని ఆ కాలనీ వాసులు సోమవారం ఎన్‌హెచ్ఆర్సీ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నిబంధనల ప్రకారం ములుగు జీపీ ఆధ్వర్యంలో రోడ్లు వేసి ఇరు వైపులా డ్రైనేజీ ఏర్పాటు చేసి ఎస్సీ కాలనీని రూపొందించారన్నారు. ఇటీవల కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఆ భూములకు వెళ్లేందుకు తమ ఇండ్లు, ప్రహరీని కూల్చివేయాలని చూస్తున్నారన్నారు. చర్యలు తీసుకుంటామని భద్రయ్య హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ కాలనీ వాసులు బల్గూరి కొమురయ్య, కిరణ్, సమ్మయ్య, జనార్దన్, కోగిల కుమార్, ప్రభాకర్, తలగంపల రఘు, చింత గణేశ్, ఎస్ చంద్రయ్య పాల్గొన్నారు.


ఎన్‌హెచ్ఆర్సీ రాష్ట్ర అధ్యక్షుడు భద్రయ్యకు వినతిపత్రం అందిస్తున్న ఎస్సీ కాలనీ వాసులు